క్లుప్తంగా

కోడి పందేలు నిర్వహిస్తున్న వ్యక్తులు అరెస్టు

పెనమలూరు: కోడి పందేలు నిర్వహిస్తున్న ఏడుగురు వ్యక్తులను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. పెనమలూరు ఎస్‌ఐ శేషకుమార్ తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప గ్రామ పరిధి గంగానమ్మ గుడి సమీపంలో చెరువు పక్కన కొందరు వ్యక్తులు కోడి పందేలు నిర్వహిస్తున్నారని సమాచారం రావడంతో పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో కోడి పందేలు ఆడుతున్న ఏడుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. వారి వద్ద రెండు పుంజులు, నాలుగు కోడి కత్తులు, రూ 2800, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

3న సామాజిక పింఛన్ పంపిణీ

పెనమలూరు: మండల పరిధిలో ఏప్రిల్ 3వ తేదీన సామాజిక భద్రత పింఛన్ కానుక పంపిణీ చేస్తారని మండల అభివృద్ధి అధికారి కుమార్‌బాబు తెలిపారు. ఆయన శనివారం వివరాలు తెలుపుతూ ప్రతి నెల 1వ తేదీన సామాజిక భద్రత పింఛన్ పంపిణీ జరుగుతుందన్నారు. అయితే మార్చి 31వ తేదీ ఆర్థిక సంవత్సరం ముగింపు, బ్యాంకు సెలవు కారణంగా పింఛన్ ఏప్రిల్ 3వ తేదీన పంపిణీ చేస్తామన్నారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున పింఛన్ పంపిణీపై కొన్ని గైడ్‌లైన్స్ ఇచ్చారన్నారు. పింఛన్ పంపిణీ వివరాలు ముందుగా ఆర్‌ఓకు తెలియజేయాలని, నగదు బ్యాంకు నుంచి తీసుకునే సమయంలో ధ్రువీకరణ పత్రాలు ఉండాలన్నారు. ఈ విషయంలో సచివాలయ ఉద్యోగులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. తాజాగా ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల మేరకు వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేయడం లేదన్నారు.

చంద్రబాబుపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి

ఉయ్యూరు: ఎస్సీల మనోభావాలు దెబ్బతినే విధంగా వ్యాఖ్యలు చేసిన టీడీపీ అధినేత చంద్రబాబుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని దళిత ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు పినమాల నాగకుమార్ డిమాండ్ చేశారు. స్థానిక విలేకరులతో శనివారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబు బహిరంగ సభలో శింగనమల వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వీరాంజనేయులును హేళన చేస్తూ వ్యాఖ్యలు చేయటం అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని అవమానించటమేనన్నారు. దళితులు అంటే చంద్రబాబుకు చిన్నచూపు అని అన్నారు. ఒక సామాన్య దళితుడికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి టికెట్ ఇవ్వటం తప్పా అని ప్రశ్నించారు. వీరాంజనేయులు విద్యార్హతలు తెలియకుండా వేలిముద్రగాడంటూ వ్యాఖ్యలు చేసిన చంద్రబాబుపై అట్రాసిటీ కేసు పెట్టాలన్నారు. రానున్న ఎన్నికల్లో దళితులే చంద్రబాబుకు బుద్ధి చెబుతారన్నారు.

నేటితో ముగియనున్న ఉచిత ప్రవేశాల దరఖాస్తు గడువు

గన్నవరం: విద్యా హక్కు చట్టం–2009 సెక్షన్ 12(1)సీ ప్రకారం పేద వర్గాలకు చెందిన పిల్లలకు ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో 1వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తు గడువు ఈ నెల 31వ తేదీతో ముగియనున్నట్లు మండల విద్యాశాఖ అధికారి కె.రవికుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ చట్టం ప్రకారం ప్రతి ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లను పేద వర్గాలకు చెందిన ఐదేళ్లు నిండిన పిల్లలకు అవకాశం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఉచిత ప్రవేశాల నిమిత్తం ఇప్పటికే మండలంలోని అన్ని ప్రైవేట్ స్కూల్స్ వద్ద బ్యానర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అర్హత కలిగిన పిల్లల తల్లిదండ్రులు గ్రామ సచివాలయాలు, మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 18004258599 టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

మద్యం అమ్ముతున్న మహిళ అరెస్టు

పెనమలూరు: యనమలకుదురులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో లంబాడీపేట డబ్బావంపు సెంటర్‌లో బాణావత్‌దేవి అక్రమంగా మద్యం అమ్ముతుండటంతో పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

సర్పంచి వీరాంజనేయులపై చర్యలు తీసుకోవాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్: వాట్సాప్ గ్రూపుల్లో అసభ్యకర పోస్టింగ్‌లు పెట్టి దళితులు, క్రైస్తవులను అవమానించిన రామన్నగూడెం సర్పంచి, టీడీపీ నాయకుడు రెడ్డి వీరాంజనేయులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నక్కా గాంధీ, జిల్లా కార్యదర్శి వెలగపల్లి ప్రదీప్ డిమాండ్ చేశారు. ఈ మేరకు హనుమాన్‌జంక్షన్ పోలీస్‌స్టేషన్‌లో సర్పంచి వీరాంజనేయులపై ఫిర్యాదు అందజేసినట్లు శనివారం తెలిపారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న సర్పంచి రెడ్డి వీరాంజనేయులు సభ్యసమాజం తలదించుకునే విధంగా అసభ్యకర పోస్టింగ్‌లను వాట్సాప్‌లో పెట్టడం దురదృష్టకరమని వాపోయారు. వీరాంజనేయులపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దళిత, క్రైస్తవ సంఘాలతో కలిసి వైఎస్సార్ సీపీ ప్రత్యక్ష ఆందోళన చేపడతామని గాంధీ, ప్రదీప్ హెచ్చరించారు.

జగనన్న పాలనలో ఆత్మగౌరవంతో పేదలు

- గన్నవరం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్
- విజయవాడ రూరల్ మండలంలో ప్రచారానికి శ్రీకారం
- తొలిరోజు ఎంపీ అభ్యర్థి చంద్రశేఖర్‌తో కలిసి పర్యటన
- అపూర్వ స్వాగతం పలికిన ఎనికేపాడు కాలువకట్ట వాసులు


ఎనికేపాడులో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఓ మహిళతో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్, ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖర్

రామవరప్పాడు: గత ప్రభుత్వంలో పెత్తందార్ల చేతుల్లో నలిగిపోయిన పేద వర్గాలు నేడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆత్మగౌరవంతో బతుకుతూ ఎంతో సంతోషంగా ఉన్నారని గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ అన్నారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడు, ప్రసాదంపాడు, రామవరప్పాడు కాల్వగట్టు ప్రాంతాల్లో శనివారం మచిలీపట్నం పార్లమెంట్ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖర్‌తో కలిసి వంశీమోహన్ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. తొలుత ఎనికేపాడు కాలువకట్ట ప్రాంతంలో సర్వమత ప్రార్థనలు చేశారు. అనంతరం గడపగడపకూ పర్యటిస్తూ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా వంశీమోహన్‌కు పెద్ద సంఖ్యలో నాయకులు, మహిళలు, కార్యకర్తలు అపూర్వ స్వాగతం పలికారు. ముచ్చటగా మూడోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించాలని మహిళలు ఆప్యాయంగా మంగళ హారతులు ఇచ్చారు. ఈ సందర్భంగా వంశీమోహన్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే అజెండాగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన పాలనను రాష్ట్ర ప్రజలు ఎన్నడూ మరిచిపోరన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే తమకు విజయం చేకూరుస్తాయన్నారు. ఈ ప్రభుత్వం వల్ల మంచి చేకూరి ఉంటేనే ఓటు వేయండని దమ్మున్న నాయకుడిగా సీఎం జగన్ అడుగుతున్నారని, ఇదే మాట చంద్రబాబు, పవన్ కల్యాణ్ అడగగలరా అని ప్రశ్నించారు. గత ఐదు సంవత్సరాల నుంచి పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాటు పడిందన్నారు. రాజకీయాలు, కులాలు, మతాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాయన్నారు. గత ప్రభుత్వంలో పింఛను పొందాలంటే ఒకరు చనిపోతే ఇంకొకరికి ఇచ్చేవారని, ప్రస్తుత ప్రభుత్వంలో అర్హత ఉంటే చాలు ఎంత మందికైనా పింఛను మంజూరు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. నియోజకవర్గానికి సంబంధం లేనివాళ్లు కొత్తగా ఎన్నికల సమయంలో వచ్చి పిచ్చి ప్రేలాపనలు పలుకుతున్నారని, వారికి నియోజకవర్గ ప్రజలు తమ విలువైన ఓటు ద్వారా బుద్ధి చెబుతారన్నారు. అసెంబ్లీకు తాను పోటీ చేయడం ఇది మూడో సారని నియోజకవర్గాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి చేసి చూపించామన్నారు. నియోజకవర్గ ప్రజలు తమ రెండు ఓట్లను ఫ్యాను గుర్తుకు వేసి విజయం చేకూర్చి ఆశీర్వదిస్తారన్న నమ్మకం ఉందన్నారు.

ప్రజల ఆదరణే మమ్మల్ని గెలిపిస్తుంది

మచిలీపట్నం పార్లమెంట్ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖర్ మాట్లాడుతూ తాను ప్రత్యక్ష రాజకీయాలకు కొత్త అయినా ప్రజల నుంచి వస్తున్న స్పందన అపూర్వంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రజలకు సీఎం జగన్ అందించిన సంక్షేమ పాలన ఫలితంగా జగన్‌కు జేజేలు పలుకుతున్నారన్నారు. ఈ ఒక్క నియోజకవర్గానికే సుమారు రూ.2వేల కోట్లకు పైగా నేరుగా లబ్ధిదారులకు అందించారన్నారు. పేదలు, మధ్య తరగతి వారితో పాటు అగ్రవర్ణ కులాల్లోని పేదలు కూడా జగన్‌కు మద్దతు పలుకుతున్నారన్నారు. ప్రజల నుంచి వస్తున్న ఆదరణే జగన్‌ను రెండోసారి ముఖ్యమంత్రిని చేస్తుందన్నారు. కార్యక్రమంలో గొల్లపూడి మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు, గౌడ కార్పొరేషన్ చైర్మన్ మాదు శివరామకృష్ణ, ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, జెడ్పీటీసీ సభ్యుడు సువర్ణరాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆర్. వెంకటేశ్వరరావు, కోనేరు సుబ్బారావు, మాజీ ఎంపీపీ యర్కారెడ్డి నాగిరెడ్డి, నియోజకవర్గ నాయకులు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఆయా గ్రామాల వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు, సొసైటీ చైర్మన్లు, ఎంపీటీసీ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఎన్నికలు సక్రమంగా నిర్వహించాలి

రిటర్నింగ్ అధికారి రాజు



ప్రసంగిస్తున్న రిటర్నింగ్ అధికారి రాజు

పెనమలూరు: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలు ఎటువంటి లోపాలు లేకుండా సక్రమంగా నిర్వహించాలని పెనమలూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ డి.రాజు అన్నారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం నియోజకవర్గ పరిధిలో ఉన్న పీవోలు, ఏపీవోలకు ఎన్నికల శిక్షణ తరగతులు ఆయన ప్రారంభించి ప్రసంగించారు. త్వరలో జరగనున్న ఎన్నికలు సంబంధించి పెనమలూరు నియోజకవర్గంలో అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఎన్నికల నిర్వహణ ప్రధానంగా పీవోలు, ఏపీవోలపై ఆధారపడి ఉందన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నిబంధనలకు లోబడి ఎన్నికల్లో ఎటువంటి లోపాలు లేకుండా సక్రమంగా నిర్వహించాలన్నారు. ఇందులో భాగంగానే ఎన్నికల నిర్వహణకు సంబంధించి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో సందేహాలు తలెత్తితే శిక్షణ తరగతుల్లో నివృత్తి చేసుకోవాలని సూచించారు. పీవోలు, ఏపీవోలకు రిసోర్స్ పర్సన్స్ డిజిటల్ స్క్రీన్‌పై శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీఓ కుమార్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన

ఉంగుటూరు: సాధారణ ఎన్నికల్లో భాగంగా తేలప్రోలులోని ఉషారామ ఇంజినీరింగ్ కళాశాలలో మండలంలోని పీవో, ఏపీవోలుగా నియమితులైన వారికి శనివారం ఈవీఎంలపై అవగాహన తరగతులు నిర్వహించారు. నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్, జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ ఈవీఎంలపై అవగాహన కల్పించారు. ఉదయం 9 నుంచి ఒంటి గంట వరకు 75 మందికి, 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు మరొక 74మందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ తరగతులకు టీచర్లు, సెక్టార్ ఆఫీసర్లు, ఏఎల్‌ఎంటీలు హాజరయ్యారు. గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు తహసీల్దార్లు సీత పవన్‌కుమార్, జేవీ సుబ్బారావు, శ్రీనివాసరావు ఎన్నికల డీటీలు గోపాల్‌రెడ్డి, షఫీ, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే కఠిన చర్యలు


ఉయ్యూరులో వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ బాషా, ఎస్‌ఐ గణేష్‌కుమార్

ఉయ్యూరు: ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని ఉయ్యూరు సీఐ హబీబ్ బాషా అన్నారు. సార్వత్రిక ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఉయ్యూరు పట్టణంలో శనివారం వాహన తనిఖీలు నిర్వహించారు. కోడ్ ఉల్లంఘనకు పాల్పడిన పలువురిని గుర్తించి బైండోవర్ కేసులు నమోదు చేశారు. సీఐ హబీబ్ బాషా మాట్లాడుతూ ఎన్నికల కోడ్ కచ్చితంగా పాటించాలన్నారు. కోడ్ ఉల్లంఘనకు పాల్పడ్డ ఏ ఒక్కరినీ ఉపేక్షించేది లేదన్నారు. చట్టాలను అతిక్రమించే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. వాహనాల్లో నగదు, విలువైన వస్తువులు తీసుకుని వెళ్లే సమయంలో సరైన అనుమతి పత్రాలు ఉండాలన్నారు. రూ.50 వేలకు మించి నగదు పట్టుబడితే ఆధారాలు చూపాలన్నారు. లేని పక్షంలో నగదు స్వాధీనం చేసుకుంటామని స్పష్టంచేశారు. తనిఖీల్లో ఎస్‌ఐ గణేష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

బెల్టుషాపు నిర్వాహకురాలు అరెస్టు

కంకిపాడు: బెల్టుషాపు నిర్వాహకురాలిని కంకిపాడు పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ఎస్‌ఐ డి.సందీప్ తెలిపిన కథనం మేరకు...మండలంలోని మారేడుమాక గ్రామానికి చెందిన ఆరేపల్లి ఝాన్సీ బెల్టుషాపు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందటంతో ఆమెను అదుపులోకి తీసుకుని, ఆమె వద్ద ఎనిమిది మద్యం సీసాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఝాన్సీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బెల్టుషాపు నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని ఎస్‌ఐ సందీప్ హెచ్చరించారు.

3 నుంచి వంశీకి మద్దతుగా గడప గడపకు ప్రచారం


విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు

గన్నవరం: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీమోహన్‌కు మద్దతుగా మండలంలో ఏప్రిల్ 3వ తేదీ నుంచి గడప గడపకు ప్రచారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల కమిటీ తెలిపింది. ఈ మేరకు శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీపీ అనగాని రవి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య, నియోజకవర్గ ఎన్నికల సమన్వయకర్త ఆర్‌వీఆర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నీలం ప్రవీణ్‌కుమార్ వివరాలను వెల్లడించారు. మండలంలోని అల్లాపురం గ్రామంలో ఏప్రిల్ 3వ తేదీన ప్రారంభమయ్యే ప్రచారం తర్వాత మండలంలోని అన్ని గ్రామాల్లో కొనసాగుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించనున్నట్లు చెప్పారు. నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్న వంశీమోహన్‌కు మద్దతుగా నిలవాలని కోరనున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ టిప్పరు డ్రైవర్, ఉపాధి కూలీ, సామాన్య రైతుకు ఎంపీ, ఎమ్మెల్యే టికెట్లు ఇవ్వడాన్ని టీడీపీ అధినేత చంద్రబాబు అవహేళన చేయడం దుర్మార్గమన్నారు. ఇటువంటి పెత్తందారుల టీడీపీని రానున్న ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ గౌసాని, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి జలసూత్రం రామ్మోహన్‌రావు, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పోలిమెట్ల జయరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు పడమట సురేష్, తిరివీధి రంగారావు, సూరెడ్డి మణిమ్మ, నాగనబోయిన గిరీష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు హెచ్‌ఎం సుబ్బారావు



గన్నవరంరూరల్: తరగతి గదిలోనే దేశ భవిష్యత్ రూపుదిద్దుకుంటుందని పెద్దలు ఏనాడో చెప్పారని ఎంఈవో కొండా రవికుమార్ అన్నారు. ముస్తాబాద జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ఎంవీ సుబ్బారావు ఉద్యోగ విరమణ సందర్భంగా శనివారం స్థానిక పాఠశాలలో జరిగిన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 30 ఏళ్ల పాటు విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి, క్రమశిక్షణతో తీర్చిదిద్ది వారి ఉన్నతికి బాటలు వేసిన సుబ్బారావు ఆదర్శనీయుడన్నారు. అనంతరం సుబ్బారావు, విద్యాధరి దంపతులను ఘనంగా సత్కరించారు. విశ్రాంత డీవైఈవో ఎం.జయబాబు, ఎస్‌ఎంసీ చైర్మన్ కందుల రాజేష్‌కుమార్, షేక్ బాజీ, సీఆర్‌పీ దుర్గాదేవి, పాలడుగు రత్నారావు, దామోదర గణపతిరావు, సగ్గుర్తి శ్రీనివాసరావు, రాజనాల శ్రీధర్, ఉపాధ్యాయ సంఘాలు, పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలి


గ్రామ సభలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఏసీపీ భాస్కరరావు

రామవరప్పాడు: ఎన్నికల సమయంలో ప్రజలు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాలని సెంట్రల్ ఏసీపీ భాస్కరరావు సూచించారు. పోలీస్ కమిషనర్ టి.కె.రాణా ఆదేశాల మేరకు విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడు ధూపాల కట్ట ప్రాంతంలో శనివారం రాత్రి గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రతి ఒక్కరిపై నిఘా ఉంటుందన్నారు. ఎన్నికల నియమాలపై అవగాహన పెంపొందించుకుని పాటించాలన్నారు. అసాంఘిక ఘటనలు చోటు చేసుకోకుండా నేరప్రవృత్తి గలిగిన వారిని అదుపులోకి తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలు తమ ఓటు హక్కును స్వచ్ఛందంగా వినియోగించుకోవాలని, ఎటువంటి ప్రలోభాలకు గురి కాకుండా ఉండాలన్నారు. సమస్యాత్మకంగా ఉన్న పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలు మీ దృష్టికి వస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో పటమట సీఐ మోహన్‌రెడ్డి, ఎస్‌ఐ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బెజవాడ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా అరిగెల



హనుమాన్‌జంక్షన్‌రూరల్: బెజవాడ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా బాపులపాడు మండలం కానుమోలుకు చెందిన ప్రముఖ అడ్వకేట్ అరిగెల శివరామప్రసాద్ (రాజా) ఎన్నికయ్యారు. హోరాహోరీగా జరిగిన బార్ అసోసియేషన్ ఎన్నికల్లో 640 ఓట్లతో అరిగెల గెలుపొందారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థి నాయకుడిగా రాజకీయాల్లో అడుగు పెట్టిన అరిగెల శివరామప్రసాద్ ఆ తర్వాత గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరుడిగా వైఎస్సార్ సీపీ లీగల్ సెల్‌లోనూ క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. ప్రతిష్టాత్మక బెజవాడ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక అయ్యేందుకు తనకు సహకరించిన వల్లభనేని వంశీ, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత డాక్టర్ దుట్టా రామచంద్రరావు, పారిశ్రామిక వేత్త పుట్టగుంట సతీష్‌కుమార్, కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అరిగెల శివరామప్రసాద్‌కు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నక్కా గాంధీ, జేసీఎస్ మండల ఇన్‌చార్జి ఆవిర్నేని శేషగిరిరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సుంకర సుభాష్‌చంద్రబోస్ అభినందనలు తెలిపారు.

కూటమి కుట్రలను తిప్పికొట్టాలి

కంకిపాడులో ఇంటింటి ప్రచారంలో మంత్రి జోగి రమేష్


కంకిపాడులోని దుకాణదారురాలితో మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్

కంకిపాడు: రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పాలనపై టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి కుట్రలు పన్నుతున్నాయని, ప్రజలు వాటిని తిప్పికొట్టాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. మండల కేంద్రమైన కంకిపాడు పట్టణంలో శనివారం ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని ఆరోగ్య మాత ఆసుపత్రి ప్రాంతం, పెట్రోలు బంకు సెంటరు, బ్యాంకు కాలనీ, వాణీనగర్ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు వివరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు అనుగుణంగా సంక్షేమ పాలన అందిస్తూ, అభివృద్ధికి కూడా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలియజెప్పారు. ఈ సందర్భంగా మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ ప్రతి గడపకూ సంక్షేమాన్ని చేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అని అన్నారు. సంక్షేమ పాలనతో ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉన్నారన్నారు. దొంగలంతా జట్టుగా చేరి, ప్రజల సంతోషాన్ని దూరం చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు విజ్ఞతతో ఆలోచించి వారి కుట్రలను భగ్నం చేయాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అఖండ విజయాన్ని చేకూర్చాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, ఏఎంసీ వైస్‌చైర్మన్ మాదు వసంతరావు, జేసీఎస్ చైర్మన్ రాచూరి చిరంజీవి, సగర, టిడ్కో, కమ్మ, ఉమెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ల డైరెక్టర్లు నక్కా శ్రీనివాసరావు, పి.రాఘవరావు, రామినేని రమాదేవి, నందిపాటి బిందుమాధవి, నూర్‌బాషా ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ చిన్నా, సర్పంచ్‌లు బాకీ రమణ, మేరుగు విజయ చంద్రశేఖర్, సీహెచ్ ఆదర్శకుమార్, బొమ్మారెడ్డి శివనాగిరెడ్డి, చిప్పల రామదాసు, బాయిరెడ్డి నాగరాజు, ఎంపీటీసీలు చిట్టూరి ప్రసాద్, కోనా కిషోర్, వడుగు శ్రీనివాసరావు, సీహెచ్‌సీ చైర్మన్ మేదండ్రావు కుటుంబరావు, మాజీ ఎంపీపీ మాదు శ్రీహరిరాణి, వైఎస్సార్ సీపీ నాయకులు తంబాబత్తుల ఓంకారం, పి.రామకోటేశ్వరరావు, కంకిపాటి రమేష్, వీరంకి నరేష్, తాడేపల్లి సతీష్, కాగిత రాజా రమేష్, కలకోట ప్రసాద్‌రెడ్డి, బీహెచ్ రాజగోపాల్‌రెడ్డి, కలపాల వజ్రాలు, బందెల సుబ్బారావు, కొండవీటి సుబ్బారావు, చిట్టూరి కోటయ్యబాబు, వీరంకి అయ్యన్నబాబు, ఏఎంసీ డైరెక్టర్లు నకరికంటి శేఖర్, జొన్నలగడ్డ నాగేశ్వరరావు, కె.మరియబాబు పాల్గొన్నారు.

అందుబాటులోకి రానున్న భోజనశాల


నూతనంగా నిర్మిస్తున్న వంట, భోజనశాల

గన్నవరం: నాడు–నేడు మనబడి కార్యక్రమం ద్వారా మండలంలోని దావాజిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రూపురేఖలు మారిపోయాయి. ప్రస్తుత పాఠశాల భవనాలను ఆధునీకరించడంతో పాటు అదనపు సౌకర్యాలను కల్పించారు. పెరిగిన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టారు. పాఠశాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో పాటు దాతలు కూడా ముందుకువచ్చారు. బుద్ధవరం గ్రామానికి చెందిన మాగంటి మురళి సుమారు రూ.20 లక్షల వ్యయంతో పాఠశాలలో వంటశాల, భోజనశాలను నిర్మాణం చేయిస్తున్నారు. ప్రస్తుతం పాఠశాలలో ఈ సదుపాయాలు లేకపోవడంతో గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన మురళి విద్యార్థుల సౌకర్యార్థం వంటశాల, భోజనశాల నిర్మాణానికి ముందుకువచ్చారు. 23 అడుగుల వెడల్పు 153 అడుగుల పొడవునా జీఐ షీట్లతో షెడ్డు నిర్మాణం దాదాపు పూర్తి కావచ్చింది. ఏప్రిల్ నెలలో వంటశాల, భోజనశాలను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు సన్నహాలు చేస్తున్నారు. నాడు–నేడు రెండవ ఫేజ్‌లో చేపట్టిన తొమ్మిది అదనపు తరగతి గదులను వచ్చే విద్యా సంవత్సరం నుంచి అందుబాటులోకి తీసుకురానున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘన

- కంకిపాడు టీడీపీ కార్యాలయం వద్ద ఎగురుతున్న టీడీపీ జెండా
- పట్టించుకోని అధికారులు


కంకిపాడు టీడీపీ కార్యాలయం వద్ద నిబంధనలకు విరుద్ధంగా ఎగురుతున్న టీడీపీ జెండా

కంకిపాడు: తెలుగుదేశం పార్టీ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని యథేచ్ఛగా ఉల్లంఘిస్తోంది. ఎన్నికల సంఘం ఆదేశాలను పక్కన పెట్టి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోంది. కంకిపాడు టీడీపీ కార్యాలయం వద్ద ఆ పార్టీ జెండా ఎగరటం ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించటమే. ఈడుపుగల్లులో నిర్వహించిన ఓ సమావేశం నేపథ్యంలో ఆ పార్టీ నేతలు కంకిపాడు కార్యాలయం వద్ద పార్టీ జెండాను ఎగురవేశారు. జెండా ఎగురవేసి, కూటమికి అనుకూలంగా నినాదాలు చేశారు. ఇంత జరిగినా అధికారులు పత్తా లేరు. ప్రవర్తనా నియమావళి పకడ్బందీగా అమలు చేయాల్సి ఉంది. కోడ్ ఉల్లంఘనపై అధికారులు ఏ మేరకు చర్యలు తీసుకుంటారో చూడాలి.

రిపబ్లిక్ ఆఫ్ వనాటుతో క్యాపిటల్ ఆస్పత్రి ఒప్పందం


వనాటు దేశ అధికారులతో ఒప్పందం చేసుకున్న క్యాపిటల్ ఆస్పత్రి యాజమాన్యం

పెనమలూరు: రిపబ్లిక్ ఆఫ్ వనాటుతో పోరంకి క్యాపిటల్ ఆస్పత్రి ప్రపంచ స్థాయి ఆరోగ్య సంరక్షణ సేవలు అందించటానికి అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. పోరంకి క్యాపిటల్ ఆస్పత్రిలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఇరు పక్షాల ప్రతినిధులు ఒప్పందంపై సంతకం చేశారు. ఈ సందర్భంగా క్యాపిటల్ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ మన్నె హరీష్ వివరాలు తెలుపుతూ రిపబ్లిక్ ఆఫ్ వనాటు ఆరోగ్య మంత్రి జాన్‌స్టిల్ తారికేటు, ఎంపీ డాన్‌కేన్, వనాటు ప్రభుత్వ ఆరోగ్య సలహాదారు డాక్టర్ సుందర్, డాక్టర్ బాలాజీ క్యాపిటల్ ఆస్పత్రిని సందర్శించారన్నారు. విజయవాడను మెడికల్ టూరిజంలో ఉత్తమంగా తీర్చిదిద్దటానికి వనాటు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నామని వివరించారు. క్యాపిటల్ ఆస్పత్రిని రిపబ్లిక్ ఆఫ్ వనాటులో ఎంపానెల్డ్ ఆస్పత్రిగా(జాబితాలో ఎంపిక) చేయటానికి ప్రతినిధులు అంగీకరించారు. వనాటులో డయాలసిస్ కోసం టెలి మెడిసిన్ సేవలకు భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు. కార్యక్రమంలో మెడికల్ డైరెక్టర్ వి.సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

వలంటీర్లపై టీడీపీ తప్పుడు ఫిర్యాదు దుర్మార్గం

గన్నవరం: ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా నిలుస్తున్న వలంటీర్లపై ఈసీకి టీడీపీ తప్పుడు ఫిర్యాదులు చేయించి వారి సేవలను నిలిపివేయించడం దుర్మార్గమని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య అన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వలంటీర్లు సామాజిక పింఛన్లు, ఇతర సంక్షేమ పథకాలు ఇవ్వకూడదంటూ నిమ్మగడ్డ రమేష్‌కుమార్‌తో టీడీపీ ఈసీకి ఫిర్యాదులు చేయడం దారుణమన్నారు. వీరి ఫిర్యాదుతో ఎన్నికల కోడ్ ముగిసే వరకు వలంటీర్లతో పింఛన్లు పంపిణీ చేయవద్దంటూ ఎలక్షన్ కమిషన్ ఆంక్షలు విధించిందన్నారు. అవినీతి రహితంగా ప్రజలకు సంక్షేమ ఫలాలను అందిస్తున్న వలంటీర్లపై ఎల్లో బ్యాచ్ బరితెగించిందని మండిపడ్డారు. మాజీ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ టీడీపీ తొత్తుగా వ్యవహరిస్తున్నారన్నారు.